
# శ్రీసాయి విమర్శ ఖండనము

మరియు

# శ్రీదత్తాష్టకములు




## శ్రీదత్తస్వామి విరచితములు

శ్రీదత్తస్వామి విరచిత ...

# శ్రీసాయి విమర్శ ఖండనము
## మరియు
# శ్రీదత్తాష్టకములు



తమ ఏకైక కుమారుడైన **చి.శ్రీవత్సదత్త** ఉపనయన శుభ సందర్భముగా – **శ్రీ ప్రక్కి సూర్యనారాయణ, శ్రీమతి భాగ్యలక్ష్మి** దంపతులచే శ్రీ దత్తసేవలో ముద్రితములు.

(**గమనిక :** వీటిని మరల ముద్రించిగాని, ఇతర భాషలలోకి అనువదించిగాని, పత్రికల ద్వారాకాని, ప్రచారము చేయుటకు, ఇందు మూలముగా అనుమతి ఇవ్వటమైనది.)

**– శ్రీ దత్త జ్ఞాన ప్రచార పరిషత్**

# కవి పరిచయం

శ్రీ దత్తస్వామి (శ్రీ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారు) 16 సం. వయస్సులోనే సంస్కృతములో 100 గ్రంథములకు పైగా ఆధ్యాత్మికములో, శంకర–రామానుజ–మధ్వ మతత్రయ సమన్వయమును చేస్తూ రచించినారు. వీరు 19 సం. వయస్సులో కెమిస్ట్రీలో పి.హెచ్.డి.ని పొంది ప్రొఫెసరుగా పనిచేసినారు. వీరి వేదాంత ఉపన్యాసములు ఆంగ్లములో పదమూడు సంపుటములలో ముద్రణలో ఉన్నవి. వీరి సంస్కృత గ్రంథములు కొన్ని తెలుగు అనువాదములో ఇప్పటికే ముద్రించ బడినవి (శ్రీ దత్త గురు భగవద్గీత, శ్రీ దత్తోపనిషత్తులు, శ్రీ కృష్ణ భాగవతమ్, దత్తాత్రేయము ...మొదలగునవి). వీరు లోకదృష్టిలో శ్రీ దత్తాత్రేయస్వామి ఉపాసకులు. వీరి ఆత్మీయ భక్తుల దృష్టిలో సాక్షాత్ శ్రీ దత్తాత్రేయ స్వరూపులు. ప్రస్తుత గ్రంథములో శ్రీ సంపూర్ణానంద చేసిన శ్రీ సాయి విమర్శలను శ్రీ దత్తస్వామి ఖండించుట మరియు శ్రీ దత్తస్వామి రచించిన శ్రీ దత్తస్తోత్రములు ప్రచురించబడినవి.

**దశిక శ్రీ కృష్ణ సూర్యనారాయణ మూర్తి (అజయ్)**

**శిష్ట్లా ఫణికుమార్**

Printed by

**SRI DATTA JNANA PRACHARA PARISHAT**

Door No.: 23-11-1/2, Satyanarayana Puram,

Vijayawada-520 011

Ph.: 0866-2531167, Mobile: 0-90001 79292

Website: **www.universal–spirituality.org**

# శ్రీసాయి విమర్శ ఖండనము

[12-07-2014 గురుపూర్ణిమ నాడు భక్తులు శ్రీదత్తస్వామితో, ద్వారకాపీఠాధిపతి యగు శ్రీసంపూర్ణానందస్వామి, శ్రీ షిరిడీ సాయాబాబా మీద చేసిన ఆక్షేపణల గురించి ప్రస్తావించగా, శ్రీదత్తస్వామి ఇచ్చిన సందేశమే ఇది.]

ఈ రోజు గురు పూర్ణిమ. శ్రీ షిరిడీ సాయిబాబావారి మూలంగా ఈ పండుగ చాలా ప్రసిద్ధికి వచ్చినది. ఈ సందేశమునకు ఈ రోజు చాలా యోగ్యము. స్వామి సంపూర్ణానంద, లోతుగా విశ్లేషణ చేయకుండా బాబావారిపై ఆక్షేపణలనుచేసినారు. ఆయన చేసిన విమర్శలు ఆయననే కాక, ఆయన మూలగురువగు ఆది శంకరులనే వ్యతిరేకించు చున్నవి. హిందూమతములోని భిన్నసంస్కృతుల యొక్క మిశ్రమమైన స్మార్తమార్గమును శ్రీసంపూర్ణానందయే స్వయముగా అనుసరించుచున్నారు గదా.

**భిన్న సంస్కృతుల మిశ్రమ – ఏకీకరణము :**

రెండు భిన్న సంస్కృతి మార్గములను గురించి ఆలోచిద్దాము. ఈ రెండింటిలో ఒకటి సుప్రసిద్ధ శైవమతము, మరియొకటి సుప్రసిద్ధ వైష్ణవమతము. ఈ రెండు మతములు అంతరార్థ వేదాంతములందే కాక, బాహ్యసంస్కృతులలో సైతము పరస్పర విరుద్ధములు. మొదటి మతము వారు నుదిటిపై అడ్డరేఖలను, రెండవమతము వారు నుదిటిపై నిలువురేఖలను బొట్టుగా పెట్టుచుందురు. పాత చరిత్రను తిరగేస్తే, ఈ రెండుమతముల విరోధము ఎంత తీవ్ర మంటే – ఒకరి నొకరు చంపుకొనుట వరకు జరిగినది. ఈ మతముల ఆరాధ్య దైవములు (లక్ష్యములు) కూడా పూర్తిగా భిన్నములే. ఒక మత జనులు వారి దైవమునకు రెండవమతము వారి దైవము కూడా దాస్యము చేయునందురు. మొదటి మతము వారు తమ మతదైవమైన శివునకు, రెండవ మత దైవమైన విష్ణువు దాసుడందురు. రెండవ మతము వారు కూడా అట్లే విష్ణువునకు శివుడు భక్తుడందురు.

మూడవ మార్గమైన స్మార్త మతము, యీ రెండు మతముల సమన్వయము కొరకు ఉద్భవించినది. ఆదిశంకురులు, వారి శిష్యుడగు యీ శ్రీ సంపూర్ణానందయును యీ మూడవ మార్గమునకు చెందినవారే. ఈ శ్రీ సంపూర్ణానందగానీ, మరి ఏ శంకర పీఠాధిపతి గానీ, నుదిటిపై అడ్డముగా బొట్టు పెట్టి, సంభాషణ సందేశము చివర

'***ఇతి నారాయణ స్మృతి:***' అని ముగించుట ఆచారమై యున్నది. ఈ స్మార్త మతము, రెండు మత లక్ష్యములగు శివ విష్ణువు లొకరే యనుటయే కాక, మార్గ సంస్కృతులను కూడా మిళితము చేయును. రెండు మతముల లక్ష్యమగు ఒకే పరమాత్మను చేరు ప్రయత్నమే రెండు మార్గములలోని సంస్కృతి తాత్పర్యము. స్మార్త మార్గస్థుడు, ఈ రెండుమతములకు పంబంధించిన పండుగలన్నియును చేయును. ప్రతి పండుగ లోను, ఒకే భగవంతుని చేరు ప్రయత్నము (సంస్కృతి) కూడా ఒక్కటే కావున మార్గసంస్కృతి కూడా ఒక్కటియే కావలయును. రెండు ఎట్లు అగును?

శ్రీ సాయిబాబా కూడా భిన్న సంస్కృతులు గల హిందూ–ముస్లిం మతములను అనుసరించుటను, స్మార్త మార్గము నవలంబించు శ్రీసంపూర్ణానంద ఆక్షేపించుట విచిత్రము. భిన్నమత సంస్కృతులు గల శివ, విష్ణువులలో ఒకే దైవత్వ మున్నప్పుడు, అదే దైవత్వము, భిన్నమత సంస్కృతి గల 'అల్లా'లో ఏల ఉండరాదు? భిన్నమతముల లక్ష్యములలోను, మార్గసంస్కృతులలోను ఏకత్వమును సాధించిన స్మార్త మతమార్గమునకు మూలపురుషుడే ఆది శంకరులు. లక్ష్యము ఒకటే అయినప్పుడు, ఆ లక్ష్యమును చేరు ప్రయత్నమే సారాంశముగా గల భిన్న మత మార్గములు కూడా ఒకటియే కావలయును. వాటిలో విరోధము అసంభవము. భూమిపై నున్న ఒకే పట్టణమును చేరు మార్గములు వేరు వేరు కావచ్చును కాని, ఒకే దైవ ప్రీతిని లక్ష్యముగా గలిగి, ఆ లక్ష్యసాధన ప్రయత్న రూపములైన భిన్నమతములు మాత్రము వేరు వేరు కాలేవు. ప్రయత్న రూపమైన సాధన ఒకటియే గదా. భూమిపై నున్న మార్గములు వేరు వేరుగా నుండవచ్చును కానీ, సాధన తత్త్వము ఒకటియే గల మతములు వేరువేరుగా నుండజాలవు. ఒకే పట్టణమును చేరు భిన్నమార్గములను, ఒకే దైవమును చేరు భిన్న మతములతో పూర్తిగా పోల్చరాదు.

ఆదిశంకురులు మతలక్ష్యములైన దైవరూపములందే కాక, ఆయా దైవరూపములను ప్రసన్నము చేసుకొను మార్గములగు మతములందును ఏకత్వమును సాధించినారు. ఈ విశ్వమను బ్రహ్మాండమునకు ప్రతీకగా నిలచిన పిండాండమే హిందూమతము. హిందూమతము లోని మతముల యొక్క ప్రతీకలుగా విశ్వమతములను తీసుకొనవచ్చును. అన్ని మతముల దేవతా రూపములలో దైవత్వము ఒకటే అనియు, ఆ ఏకైక దైవప్రీతిని సాధించు ప్రయత్నములగు మత మార్గములు కూడా ఒకటియేనని బోధించు విశ్వమతములోని ఉపమతములే యీ విశ్వమందున్న మతములు. కావున

హిందూ మతముతో విశ్వమతము పూర్తిగ పోలియున్నది. మతముల బాహ్యసంస్కృతులగు భాషాభేదము, రూపభేదము, వస్త్రధారణభేదము, ఆహారాదులలో భేదము మొదలగు భేదము లన్నియు పట్టించు కొనుటకు పనికిరానివి. ఏలనన, దైవము ఒకటియే, మరల, దైవసాధన ప్రయత్నమే ఏకతాత్పర్యముగా గల మతములు కూడా ఒకటే గదా.

దైవము ఊహకును అందని అతీతము అని మా సిద్ధాంతము. ఆ దైవము చైతన్యమని అద్వైతులందురు. మా యీమత భేదము గురించిన చర్చ ఇచట అప్రస్తుతము. దైవము అనూహ్యమైననూ, చైతన్య స్వరూపమైననూ, పైన చెప్పిన బాహ్యభేదము లేవియును దైవమును అంటజాలవు. శంకర మతములోను, బాహ్యములగు మిథ్యానామ రూపముల భేదము, సత్యమైన అంత: స్వరూపము అగు బ్రహ్మమును స్పృశించ జాలదనియే గదా సారాంశము. ఈ శంకర సిద్ధాంతమును హిందూమతము లోని భిన్న మతములకే కాక, విశ్వమతములోని భిన్న మతములగు హిందూ, ముస్లిం, క్రైస్తవాది మతములకును ఏల వర్తింప చేయరాదు? హిందూమతమునకు ఒక సిద్ధాంతమును, ఇతర మతములకు మరియొక సిద్ధాంతమును వర్తింపచేయుట విజ్ఞత కాజాలదు. భారతదేశములోని హిందూమతమునకు, విశ్వములోని ఇతర మతములకు ఒకే తర్కమును అన్వయించ వలెను.

ఆదిశంకరులు హిందూమతములోని ఉపమతముల మధ్య నున్న అడ్డుగోడలను తొలగించినారు. ఒకే ఇంటిలో ఉన్న గదుల మధ్య గోడలను తొలగించి, మొత్తము ఇంటిని ఒకే హాలుగా చేయుటయే యీపని. శ్రీ సాయిబాబా ఇదే పనిని ప్రపంచములో నున్న మతముల మధ్య గోడలను తొలగించి చేసినారు. అంటే–వారు ఒకే హాలుగా మారిన ఇళ్ళను అన్నింటిని కలిపి ఒకే పెద్దహాలును చేసినారు. ప్రతి మతములోను, ఉపమతములను ఏకీకరణము చేయు ప్రయత్నము జరిగినది. ఇస్లాం మతములోను, ప్రవక్త మహమ్మదు రాకముందు అనేక ఉపమతము లుండెడివి. ప్రవక్త, యీ ఉపమతముల మధ్య గోడలను తొలగించి ఒకే మతమును చేసి, **'అల్లా'** అను పేరుతో ఒకే దైవమును స్థాపించినారు. హిందూమతములో శంకరులు చేసినపనినే, ప్రవక్త మహమ్మదు, ఇస్లాంలో చేసినారు. ఈ ఇరువురి ప్రయత్నముల వల్లను, హిందూమతము ఒక పెద్దహాలుగాను, ముస్లింమతము మరియొక

పెద్దహాలుగాను మారినవి. ఇప్పుడు శ్రీ సాయిబాబా యీ రెండు పెద్దహాలుల మధ్య గోడలను తొలగించి 'ఒకే ఒక పెద్దహాలును' ఏర్పరిచినారు. ఈ విశ్వములోని అన్ని మతములను పెద్దహాలులను కలిపి, ఒకే పెద్దప్రపంచ హాలును నిర్మించినారు స్వామి వివేకానంద.

ఇప్పుడు ఆదిశంకరులు, మహమ్మదుప్రవక్త, సాయిబాబా, వివేకానందులలో ఏమి తేడా ఉన్నది? శ్రీ రామకృష్ణ పరమహంస గూడా అన్ని మతముల దైవరూపములలోను, అన్ని మతముల మార్గములలోను ఏకత్వమును అనుభూతిగా పొంది, దానిని ప్రకటించినారు. అన్ని మతముల లక్ష్యములలో ఏకత్వమే ఒకే దేవుడు. అన్ని మత మార్గములలో ఏకత్వము ఆ ఒకే దైవమును ప్రసన్నము చేసుకొను ఏకైకప్రయత్నమే. ఈ విషయము, శ్రీ సంపూర్ణానంద వాదించు మతసంస్కృతుల భిన్నత్వమును ఖండించుచున్నది. ఈ విషయములో ఆయన సాయిబాబాను దూషించినచో, వారి గురువగు ఆదిశంకరులను కూడా పరోక్షముగ దూషించినట్లే గదా.

**మతముల ఐక్యత నిగూఢతర్క సాధ్యము :**

స్వామి వివేకానంద ప్రపంచ పౌరుల సభలో మతసామరస్యమునకై ప్రయత్నించినారు. ఈ సందేశము నిచ్చు దత్తస్వామి, ఆ సామరస్యమును నిగూఢ తర్కవాదముతో సాధించుచున్నారు. దీనికి కారణమేమనగా – ప్రతి మానవుడును తనలో నున్న అత్యున్నతమైన బుద్ధియోగమును సమాధానపరచగల తర్కముతోనే సంతృప్తిని చెందును. ఆతర్కవాదమేమనగా –

శ్రీ సంపూర్ణానంద స్వామిజీ హిందూమతమునకు చెందినవారు. ఈ హిందూమత దైవమగు పరబ్రహ్మము యీ విశ్వమును సృష్టించినది కావున, యీ విశ్వములోగల అన్ని పాశ్చాత్యదేశములను కూడా పరబ్రహ్మమే సృష్టించినది గదా. ఈ భారతదేశములో అనేక దైవావతార పురుషులు హిందువుల కొరకు ఆధ్యాత్మిక జ్ఞానమును వర్షించినారు. అయితే, ఈ జ్ఞానామృతము భారతదేశములో కురిసిన సమయములోనే వెంటనే అన్ని పాశ్చాత్యదేశములకు చేరలేదు. పాశ్చాత్యదేశములు, భారతదేశమును 17వ శతాబ్దము లోనే కనుగొన్నవి. అప్పటివరకు, పాశ్చాత్యదేశములలో అనేక మనుష్యతరములు, యీ జ్ఞానామృతమును తెలుసుకొను అవకాశమే లేక అంతరించినవి. అయితే, విశ్వములోని అన్ని దేశముల జీవులును ఆ ఏకైక దైవమైన పరబ్రహ్మము

యొక్క సంతానమేకదా (**అహంబీజప్రద:పితా...** గీత). మరి, 17వశతాబ్దము వరకు భారతదేశజీవులగు కొందరు పుత్రులకే జ్ఞానామృతమునిచ్చి, యీ నిష్కారణ పక్షపాతము నేల దైవము చూపినది? దైవము విశ్వమును సృష్టిచేసినపుడు, సర్వవిశ్వజీవులకు ఒకే మాతృభాషగా సంస్కృతమును పెట్టియుండవలసినది. సృష్టించినపుడే, అన్ని దేశములను అనుసంధానము చేసి ఉన్నచో, సంస్కృతములో ఇచ్చట బోధించిన జ్ఞానామృతము వెంటనే అన్ని దేశములకు వ్యాపించి యుండెడిది. అప్పుడు విశ్వపితయగు దైవమునకు ఎట్టి పక్షపాత దోషము లేశమైనను వచ్చియుండెడిది కాదుగదా. దీనికి ఒకేఒక సమాధానము తప్పవేరు మార్గము లేదు. అది ఏ మనగా – సృష్టించిన సమయము నుండి, విశ్వములోని అన్ని దేశములకు ఏకైక దైవమగు పరబ్రహ్మము అనేక రూపములలో అవతరించి, ఆయాభాషలలో ఈ జ్ఞానామృతమును బోధించినట్లు అంగీకరించవలెను. ఆయా దేశముల జీవుల గ్రహణశక్తి స్థాయిలననుసరించి భిన్నస్థాయిలలో యీ జ్ఞానామృతమును బోధించి యుండవచ్చును. సర్వమతదైవరూపములలో ఒకే దైవమున్నదనియు, ఆ దైవప్రీతిని సాధించు ప్రయత్నమే తాత్పర్యముగాగల మతములన్నియు ఒక్కటేననియు, యీ ఏకైక సమాధానమే నిరూపించుచున్నది. శ్రీ సంపూర్ణానంద, దీనిని అంగీకరించనిచో, దైవమునకు అంటు అకారణ పక్షపాత దోషమును గురించి సమాధానమీయవలెను. తమ మతమే నిజమైనది యని భావించు ప్రతి మతమునకును, ఈ పక్షపాత దోషము వెంబడించుచున్నది, కావున, సర్వమతములును ఈ సమాధాన సమన్వయము నంగీకరించక తప్పదు.

**శాకాహార మార్గము–దైవత్వము :**

శ్రీ సంపూర్ణానంద, మాంసాహారి యగు శ్రీ సాయిబాబా దైవము కాదనుచున్నారు. ఆయనే శ్రీరాముని దైవముగా స్తుతించుచున్నారు. శ్రీరాముడు కూడా మాంసాహారియే కదా! సాయిని పూజించరాదని ఎట్లు చెప్పుచున్నారు? ఆహారము బాహ్యసంస్కృతియే. ఆయిననూ, ప్రాణివధ కారణమున మాంసాహారము పాపమే. కాని, భగవంతుడు ఒకచోట అవతరించినపుడు అచట నున్న జీవుల బాహ్యసంస్కృతిని తానూ అనుసరించి, వారితో ముందు సఖ్యతను ఏర్పరుచుకొనును. ఆ తరువాత వారికి జ్ఞానబోధను చేయుచు, పరమధర్మమైన అహింసామార్గమునకు వారిని నెమ్మదిగా మరలించును. బురదగుంటలో కూరుకొని పోవువారిని ఉద్ధరించుటకు రక్షకుడును,

బురదగుంటలో దూకవలయును కదా. అట్లు దూకినప్పుడు తన దేహమునకును బురద అంటుకొనక తప్పదు. పరుగెత్తు ఆంబోతును నిలువరించుటకు ముందు, దానితో కూడా కొన్ని అడుగులు వేయకతప్పదు. అజ్ఞానులను ఉద్ధరించుటకు ముందు వారి అజ్ఞానమును కొంతకాలము అనుసరించుట, అవతారపురుషునకు తప్పదు. గాయపడిన జటాయుపక్షిని చూచి దు:ఖించిన శ్రీరాముని, ప్రేమతో మేక నెత్తుకొన్న క్రీస్తును, మాంసాహార విషయములో ఇట్లు అర్థము చేసుకొనవలెను. కానీ, శ్రీ సాయిబాబాను మాంసాహారి యనుట సరికాదు. మాంసాహార భక్తులకు, మాంసాహారమును వండించి వడ్డించినాడే తప్ప, తాను మాంసాహార భక్షణము చేయలేదు. భక్తురాలు గేదెను కొట్టినందుకే తన వీపుపై వాతను చూపి భూతదయను బోధించిన శ్రీసాయి, అమాయక జంతువధ వలన లభ్యమైన మాంసమును తినునా? శ్రీరాముని మాంసాహారమును క్షత్రియకుల ధర్మముగా చూచిననూ, తాను బ్రాహ్మణుడని ఎన్నోసార్లు ఎలుగెత్తి చాటిన శ్రీసాయి విషయమున దీనిని నమ్మశక్యము కాదు. మాంసాహారులెవరైన తమ పాపమును సమర్థించు కొనుటకు ఇట్లు శ్రీసాయిపై ఆరోపించి చెప్పియుండవచ్చును. కాదని, నీవు మూర్ఖముగా శ్రీసాయి మాంసాహారియేనని వాదించిననూ, కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లే వ్యర్థమగును. ఏలననగా– మాంసాహారమునకును–దైవత్వమునకును ఎట్టి సంబంధము లేదని శ్రీరాముని విషయములో తేలినది కదా.

శ్రీ సాయిబాబా మేకను స్వయముగా చంపినారన్న మీ ఆక్షేపణయును పూర్తిగ అసత్యము. ఆయన ఒక మేకను చంపమని ఒక బ్రాహ్మణ భక్తుని ఆదేశించగా, ఆ భక్తుడు చంపుటకు సిద్ధమయ్యెను. అప్పుడు శ్రీసాయి భక్తుని వారించి 'నేనే చంపెదను' అనెను. వెంటనే మేక భూమిపైపడి చనిపోయెను. దీని ద్వారా శ్రీసాయి సృష్టి స్థితి లయములు భగవంతుని అధికారములనియు, భగవంతుడు నరావతారమున జ్ఞాన బోధకుడనియు సూచించెను.

**శ్రీసాయి హిందూమతస్థుడే :**

శ్రీ సంపూర్ణానంద, శ్రీసాయిని గురించి ఆయన ముస్లిం అనియు, హిందువు కాదనియు, ముస్లిం సంస్కృతిని హిందూమతములోనికి త్రోయుచున్నారనియు, ఆరోపించుట సరికాదు. శ్రీసాయి హిందూబ్రాహ్మణుడు. ఆయన హిందూదేవతల

నారాధించుచు, భక్తులను కూడా హిందూదేవతల నారాధించుటలో ప్రోత్సహించినారు. ఒకసారి వర్షములో తడియుచు క్రింది మెట్టుపై నున్న సాయి, హనుమంతుని విగ్రహముకల పైమెట్టును భక్తులు ఎక్కమన్ననూ ఎక్కక, స్వామి కన్న క్రింది స్థాయిలోనే ఉండవలయునని పలికినారు. ఒకసారి ఒక ముస్లిం భక్తుడు తన ఆశీస్సులతో సంతానము పొంది, లడ్లు తీసుకొనిరాగా, శ్రీసాయి వాటిని హనుమంతుని గుడిలో పంచమని ఆదేశించిరి. 'అల్లా హనుమంతులకు కుస్తీ జరుగగా, హనుమంతుడే గెలిచినాడు' అని పలికిరి. ఎప్పుడు 'అల్లామాలిక్' అని పలుకు శ్రీసాయి, యిట్లు పలుకుట ఆ ముస్లిం భక్తుని మత దురభిమానమును పోగొట్టుటకే తప్ప, అల్లాపై భక్తి లేక కాదని గ్రహించవలెను. హిందూదేవతలపై శ్రీసాయి ఎంతో భక్తిని చూపించినారు. తాను హిందూబ్రాహ్మణుడననియు, ఉపనయనంలో కుట్టిన చెవులను శ్రీసాయి చూపెడివారు. ఒక దసరానాడు, తాను ముస్లిం అయినచో తనకు 'సుంతి' చేసినారా లేదా చూడమని దిగంబరుడై శ్రీసాయి కోపముతో కేకలను పెట్టినారు. ఇవి అన్నియును శ్రీసాయి హిందువనియే నిరూపించుచున్నను, ఆయన కొన్ని ముస్లిం పద్ధతులను అవలంబించుట, ఆ రెండు మతముల సమన్వయము కొరకేనని తెలియవలయును. వస్త్రధారణములో ఆయన తరువాత శ్రీ సత్యసాయిగా అవతరించినపుడు హిందు-క్రైస్తవ మత సమన్వయమును సూచిస్తూ మరొక ప్రయత్నమును చేసినారు.

**శ్రీసాయికి గురుపరంపర ఉన్నది :**

శ్రీసాయికి గురుపరంపర లేదని వారు చేసిన ఆక్షేపణయు నిజముకాదు. శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడగు శ్రీవెంకుసాయే శ్రీసాయికి గురువు. శంకరాచార్య గురుపరంపరలను కూడా, సదాశివ-శంకరాచార్య పరంపరలో చెప్పినట్లు, వెంకటేశ్వర-వెంకుసా పరంపరయు నట్టిదేగదా. తన గురువగు శ్రీవెంకుసా తన కిచ్చిన ఇటుకరాయిని, శ్రీసాయి ఎంతో ప్రియముగా దాచుకున్నారు.

**భగవదవతారముల సంఖ్య :**

భాగవతంలో కలియుగ అవతారముల సంఖ్య 22 అనియు, వాటిలో శ్రీసాయి పేరులేదని మీరు ఆక్షేపించుటలో మీరు చూపిన పాండిత్యము మీ మూలమునకే ముప్పుతెచ్చుచున్నది. ఆదిశంకరులు భగవదవతారమని వేదములోనే చెప్పబడియున్నది

(**వృప్తకేశాయచ**). శివుడే ముండిత శిరస్కుడై వచ్చునని ఈ వేదమంత్రార్థము. అయితే, ఆదిశంకరులు ఈ 22 అవతారములలో చెప్పబడలేదు. భాగవతము కన్నను వేదప్రామాణ్యము అధికము (**శ్రుతిరేవగరీయసీ**). ఎప్పుడు ఏ అవసరము వచ్చినా భగవంతుడవతరించునని గీతావచనము (**యదాయదాహి...**), ఈ పురాణోక్త సంఖ్య భగవంతుని నియమించలేదు. ఆదిశంకరులు కూడా 22 సంఖ్యలో చెప్పబడలేదని భగవదవతారము కాదని శ్రీ సంపూర్ణానంద, కర్మకాలి, చెప్పుదురా ఏమి!

**గంగాస్నాన నిషేధము :**

శ్రీసాయి భక్తులు గంగా స్నానము చేయరాదని శ్రీ సంపూర్ణానంద నిషేధించుట వారి ఘనీభవించిన అజ్ఞానపరాకాష్ఠ. ఏ నదీ జలమైననూ, హైడ్రోజన్, ఆక్సిజన్ 2:1 నిష్పత్తిలో కలిసి సమ్మేళనముగా మారుటయేకదా. నదీ జలములో కలుషములతో బాటు ఖనిజములు కూడా ఉండును. వీటిని వదిలినచో అన్ని నదీజలములు ఒక్కటియే. అజ్ఞాన దోషములను సూచించు కలుషముల పరిమాణము ఎక్కువగా గంగాజలములోనే నున్నది. ప్రస్తుత గంగాజలము మీ అజ్ఞాన కలుషితమైన బుద్ధిని సూచించుచున్నది. అజ్ఞాన రహితులగు శ్రీసాయి భక్తులకు గంగాజలస్నాన నిషేధము యీ విధముగా సంమజసమేనేమో! ప్రస్తుత ప్రభుత్వము గంగాజల శుద్ధిని గురించి చేయుచున్న ప్రయత్నము, మీ బుద్ధిని శుద్ధిచేయుటకై చేయు ప్రయత్న రూపమైన యీ సందేశము వలెనున్నది. ఎన్నో నదులు గంగవలె హిమాలయములో ఉద్భవించి సాగరమును చేరుచున్నవి. మిగిలినట్టి ఆ నదులలో స్నాన నిషేధమును చేయక, కేవల గంగనే ఎట్లు నిషేధించగలరు? అన్ని స్తోత్రములలోను గొప్పది యగు మహిమ్నః స్తోత్రము (**మహిమ్నోనాపరాస్తుతిః**) లో– నదులన్నియు నేరుగా కానీ వక్రముగా కాని పయనించుచున్నను, ఒకే సముద్రమును చేరునట్లు, భిన్న మార్గ సంస్కృతులు కల మతము లన్నియు ఒకే భగవంతుని చేరుచున్నవి (**పయసామర్ణవ ఇవ**) అని చెప్పబడినది.

**వేదమంత్రముల నుదహరించుట :**

వేదవచనములను ప్రమాణముగా తన ఉపదేశములలో చూపని శ్రీసాయి, దేవుడు కాడని శ్రీ సంపూర్ణానంద చేయు విమర్శ అనాలోచితము. వాల్మీకి రామాయణములో వాలి జాబాలి మొదలగు వారికి ఉపదేశములను చేయునపుడు కూడా శ్రీరాముడు ఎట్టి వేదవాక్యములను ఉదహరించలేదు. శ్రీరాముడు బోధించినవి

వేదములో నున్నవే కాని, అవి శ్రీరాముని సొంత మాటలలో బోధించబడినవి. అట్లే శ్రీసాయి బోధలన్నియును, వేదములలో కనిపించునవే కాని, అవి శ్రీసాయి సొంత మాటలలో నున్నవి. వేదమనగా (**విదల్ - జ్ఞానే**) జ్ఞానమని అర్థము. జ్ఞానము అనగా మాటలేవి యైనను వాటిచే చెప్పబడు భావమే ప్రధానము. అదే భావము చెప్పబడినప్పుడు, అవే మాటలు అక్కరలేదు. వేదము యొక్క భావము చెప్పబడగానే, వేదము చెప్పినట్లే. గీతను చెప్పినపుడు కృష్ణుడు కూడా వేదవాక్యముల నుదహరించలేదు. అయినా, వేదార్థసారమే గీత. అయితే, శంకరులు తన భాష్యములలో వేదవాక్యములను ప్రమాణముగా చూపినారు. పండితులతో వాదించు పరిస్థితులలో పండిత సంప్రదాయము ననుసరించి అట్లు ఉదహరించినారు. అట్లు ఉదహరించనిచో, పండితులు తృప్తినొందరు. వేదవచనములను ఉదహరించుటయే దైవత్వమన్నచో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు దైవము కారు. కేవలము శంకరులే దైవము అగుదురు. దైవము కాని పండితులు కూడా అట్లు వేదమును ఉదహరించగలరు. కావున వారు దైవమగుదురా? వేదముల నుదహరించని శ్రీసాయి – శ్రీరాములలో తేడాలేనందున, దైవము కాని శ్రీసాయిని పూజించు వారు, దైవమైన శ్రీరాముని పూజించరాదు అని ఎట్లు తేడాను ఇరువురిలో చూపగలరు?

నిశితముగ చూచినచో, బ్రహ్మసూత్రములు (**శాస్త్ర యోనిత్వాత్**) భగవంతుడే వేదముల కర్తయని పలుకుచున్నవి. గీత కూడా ఇదే చెప్పుచున్నది (**వేదాంతకృత్**). భగవంతుడు నరావతారమును ధరించినపుడు తన మాటలను తానే చిలుకవలె బట్టీ పట్టిన రీతిగా పలుక నవసరములేదు. తన మాటల భావమునే తాను వేరు మాటలతో వేరు సమయమున చెప్పవచ్చును. శంకరులు కూడా, వేదార్థమునే తన మాటలలో శ్లోకరూపమున స్తోత్రములుగా చెప్పినారు కదా. వాటికి ప్రామాణ్యము లేదా? వేదవాక్యములలోనే ఉదహరించి, వాటి అర్థమును వక్రీకరించినపుడు వేదమును ఉదహరించనట్లే అగును. వేదవాక్యములను ఉదహరించకపోయిననూ, వాటి యొక్క సత్యార్థమును వేరు మాటలలో వ్యక్తపరచిననూ, వేదమును ఉదహరించినట్లే. భగవదవతార పురుషుడు మాట్లాడినపుడు, ఆయన మాటలన్నియు వేదమే. పండితులు భాషించినపుడు, వారి భావములు వేదసమ్మతములని తెలుపుటకు, వేదవాక్యముల నుదహరింతురు. నరరూపములో పలుకుచున్న భగవంతుని వాక్యములు లోపలనున్న భగవంతునివే, కాని, బాహ్య నరరూపమునకు సంబంధించినవి కావు. భగవంతుడు

వేరు భాషలో చెప్పుభావములను సమర్థించు కొనుటకు వేరొక భాషలో చెప్పిన మాటలను (వేదమును) ఉదహరించ నవసరము లేదు. తన మాటలకు తన మాటలనే ఎట్లు ప్రమాణముగా చూపుకొనును? భగవంతుడు చెప్పిన భావములను వేదములో అన్వేషించవచ్చునే కాని, ఆ భావమును వ్యక్తపరచు మాటలు యథాతథముగా, వేదములో ఉన్నవా? లేవా? అని వెతుక పనిలేదు. భావమే జ్ఞానము. జ్ఞానమే వేదము.

**విగ్రహారాధనము :**

శ్రీసాయి విగ్రహముల నారాధించు వారు అపమార్గములో నున్నారని శ్రీ సంపూర్ణానంద ఆక్షేపించుట పిచ్చితనము. ఆరాధన లక్ష్యము సత్యమై, చేతనమై, యోగ్యమై ఉండవలెనని వారు చెప్పుచున్నారు. శ్రీసాయి విగ్రహములకు ఈ మూడింటిలో ఏ లక్షణము లేదని వారు చెప్పుచున్నారు. మిగతా దేవాలయ విగ్రహములకు ఈ మూడు ఉన్నవి కావున పూజ్యములని వారి భావన. ఈ మూడు, ప్రాణప్రతిష్ఠ ద్వారా సిద్ధించుచున్నవని వారి మతము. ఈ విధిలో ఆయా విగ్రహములలోకి ఆయా దేవతలను ప్రవేశింప చేయుటకు ఆయా వేదమంత్రములను పఠించుచున్నారు. కాని శ్రీ సాయికి సంబంధించిన వేదమంత్రమేమీ లేకపోవుటచేత ప్రాణప్రతిష్ఠ వ్యర్థమగును. కావున శ్రీసాయి విగ్రహములు పూజాయోగ్యములు కావని వారి మొండిమతము, మూడు కారణముల వలన అంగీకారము కాదు.

1) మీరు చెప్పిన ఈ మూడు లక్షణములు ఈ తంతువులలో కావలయునని వేదము ఎచ్చట చెప్పినదో మీరు చెప్పలేదు. వేదములలో ఇవి ఎచ్చటను కానరాకుండుట చేత, వేదమునుదహరించనిచో ప్రామాణ్యతలేదని మీరు చెప్పినందున, వీటికి ప్రామాణ్యత లేదు.

2) ప్రాణప్రతిష్ఠలో మంత్రములో ఎచ్చటనూ దేవతా నామములేదు. అవి కేవలము జడవిగ్రహములో ప్రాణమును తెచ్చుటకు వినియోగింపబడుచున్నవి. కావున, శ్రీసాయికి సంబంధించిన వేదమంత్రములు లేవని మీరు చెప్పుట హాస్యాస్పదము.

3) జడ విగ్రహములలో చైతన్యమున్నట్లు భావించి సేవించవలయునను తాత్పర్యమును గ్రహించక, ఈ విధి ద్వారా నిజముగా ప్రాణప్రవేశము జరుగునట్లు తలచుట మూర్ఖత్వము. అట్టి తాత్పర్యమును శ్రీసాయి విగ్రహములలో కూడా నుంచి సేవించవచ్చును కదా. జడ విగ్రహములో యీ తంతువు ద్వారా నిజముగా ప్రాణము

వచ్చుట లేదు. ఈ తంతువు తరువాత చలనము, చూపు, వినుట, భాషించుట మొదలగు ప్రాణ లక్షణములు విగ్రహములో నిజముగా వచ్చుటలేదు. కనీసం ఒక ఫ్యానులో జడశక్తియగు విద్యుత్తు ప్రవేశించగనే చలనము కనపడుచున్నది. విగ్రహములో కనీసం చలనలేశమైనను లేదు. ప్రాణప్రవేశము అనుభవవిరుద్ధము కావున ప్రామాణికము కాదు. ప్రమాణములలో శ్రుతి, స్మృతి, యుక్తి మరియు అనుభవము శాస్త్రసమ్మతములు. చివరిదగు అనుభవము వ్యతిరేకించుచున్నది కావున ఇది ఏ విధముగాను ప్రామాణికము కాదు.

ప్రాణప్రతిష్ఠ జరిగినా, జరుగకపోయినా, తేడాలేదు. విగ్రహములు ప్రతీకోపాసన కిందికి వచ్చును. అవి భగవంతుని ప్రతీకలే కాని, వాటిలో భగవంతుడులేడు (**నతస్యప్రతిమా..., ప్రతిమాహ్యల్పబుద్ధీనాం...**). ప్రాణప్రతిష్ఠ జరిగిననూ అవి సాక్షాదుపాసన కిందికిరావు. కేవలము నరావతారములే సాక్షాదుపాసన కిందికివచ్చును (**మానుషీం తనుమాశ్రితమ్...** గీత). కావున, శ్రీసంపూర్ణానంద పట్టుదల వ్యర్థము. ఈ విధిలో ఏమియు లేకున్నను, ఇది ఒక సత్యమును సూచించుచున్నది. అది ఏమనగా – జడవిగ్రహమైన జడశరీరము, ప్రాణ ప్రవేశము వలన చేతనమైన మానవుని సూచించుచున్నది. అది సూచించు తాత్పర్యమును గ్రహించవలయును కానీ, దానితో నిజముగా అది జరుగుచున్నది అని భావించరాదు. మానవుని లోనికి మాత్రమె తాను ప్రవేశింతునని తాత్పర్యము. జడము లోనికి ప్రవేశించనని యే సారాంశము. జ్ఞానబోధ చేయుటకు చేతనమైన నరరూపము కావలయునన్నదే విషయము. అట్టి నరావతారమునే పూజించి సేవించమన్నదే పరమార్థము. జడస్తంభములోని చైతన్యరూపుడైన పరమాత్మ నరసింహావతారములో ప్రవేశించినాడుగదా అన్న మీ వాదము వివేక విచార రాహిత్యమును సూచించుచున్నది. జడస్తంభమును పగులగొట్టగా చైతన్యరూపమైన నరసింహ రూపము ద్వారా పరమాత్మ వ్యక్తమైనాడే తప్ప, చైతన్య ప్రవేశము ద్వారా జడస్తంభము కదిలి గర్జించి అసురసంహారము స్వయముగా చేయలేదు. ఇచట ప్రాణప్రతిష్ఠా విధి యేమియును జరుగలేదు. కావున, పూర్తిగా ఇది అప్రస్తుతము. భక్తాగ్రేసర రక్షణార్థమై జరిగిన ప్రకృత్యతీత మహిమ ఇది. ప్రాణప్రతిష్ఠ కర్మచేత సిద్ధమైనది కాదు. ఇది విగ్రహారాధన విషయమునకు చాలా దూరమునకున్నది.

సింహముఖ నరరూపము ప్రాణి రూపమైనది కావున ప్రాణియందే భగవదావేశము జరుగునని ముఖ్యార్థము. ఇచ్చట నరసింహ శరీరము, కాలవ్యవధి లేనందున, భగవంతుని చేత సృష్టింపబడినది. అట్టి విలక్షణప్రాణి–ఉపాధి, ప్రకృతి సిద్ధము కూడా కాదు. ప్రాణి శరీరమునే భగవంతుడావేశించునన్న నియమము ఇచ్చట కూడా యథాతథముగ పాటించబడినది.

జడవిగ్రహము, ప్రాణరహితమైన జడశరీరమును సూచించుచున్నది. అట్టి జడవిగ్రహము లోనికి ప్రాణప్రతిష్ఠ ద్వారా నిజముగ ప్రాణప్రవేశము జరిగినచో, ఆ విగ్రహమే చేతన నరశరీరముగ మారును అన్న విషయమే ఇచట సూచితము. ప్రాణప్రతిష్ఠ ద్వారా నిజముగ విగ్రహములోనికి ప్రాణప్రవేశము జరుగలేదు, నిజముగా, విగ్రహము నరశరీరముగ మారనూలేదు. దీనిచే గ్రహించవలసినది ఏమనగా – చేతనమైన నరశరీరము = జడ విగ్రహము + ప్రాణము అనియే. ప్రాణములేని నరశరీరము సాక్షాత్తు జడవిగ్రహమే. కేవల జడవిగ్రహ పూజ కన్ననూ, చేతనమైన, నరశరీరమును ప్రవేశించిన భగవంతుడగు అవతారపురుషుని పూజయే చేయవలయునన్న సందేశమే జడవిగ్రహమునకు ప్రాణప్రతిష్ఠ చేయుట. సూచించిన అర్థమును గ్రహించక, సూచించు జడ విగ్రహములోనికే ప్రాణము ప్రవేశించినదన్న భ్రమతో, దానినే పూజించుట అవివేకము. అయితే, ప్రారంభదశలో నున్న వారు దానిని దైవ ప్రతీకగా భావించి పూజించుట తప్పదు. ప్రారంభదశలో దోషములు తప్పనిసరి (**సర్వారంభాహి...** గీత). కావున ప్రాణప్రతిష్ఠ తరువాత కూడా జడవిగ్రహము, జడవిగ్రహమే. గీతాచార్యుడు, అవతారపురుషుడగు కృష్ణుడు, తాను సచేతనమైన నరశరీరమును ఆశ్రయించి అవతరించెదనని గీతలో చెప్పినాడు (***మానుషీం తనుమాశ్రితమ్...***).

శ్రీ సంపూర్ణానంద చెప్పిన మూడు శబ్దములకు అర్థము నిట్లు ప్రతిపాదింపవచ్చును. దైవానుగ్రహము వలన, నీవు చేయు ప్రాణప్రతిష్ఠ ద్వారా, నిజముగా (సత్య) జడవిగ్రహములోనికి ప్రాణ ప్రవేశము జరిగి, అది సచేతనమైనచో (చేతన), అట్టి మానవ శరీరము భగవత్ప్రవేశమునకు యోగ్యము (యోగ్యత) అగును అనియే. దీని అర్థము అద్వైతులు భ్రమపడినట్లు, ప్రతి సచేతన శరీరములోనికి భగవత్ప్రవేశము జరిగినట్లు కాదు. కొందరు విశిష్ట భక్త సేవకులగు వారి యందు దైవమావేశింప, శ్రీసాయి, శంకర, రామ, కృష్ణ మొదలగు అవతారములు, ఆయా

ప్రత్యేక కార్యక్రమముల కొరకు దైవసంకల్పమునసనుసరించి ప్రకటితమగును. జడములోనికి ప్రాణప్రవేశము, ప్రాణిలోనికి దైవప్రవేశము - ఈ రెండును భగవత్సంకల్పముచే జరుగును తప్ప ఏ జీవునికి శక్యముకావు. జడము + ప్రాణము = చేతన శరీరము అను సమీకరణములో ఎడమ భాగమే కుడిభాగము కాదు. ఎడమ భాగము కుడి భాగముగా మారవలెను. ఈ మార్పు దైవవశములో నున్నది కాని, ప్రాణప్రతిష్ఠ చేయు పురోహితుడగు ఏ జీవునివశములోను లేదు. ఎంత గొప్ప విజ్ఞానవేత్తయైనను ఈ మార్పును చేయజాలడు. ఈ మార్పు నిజముగా జరుగనపుడు సమీకరణములోని కుడిభాగము సున్నా అగును. అప్పుడు ఏమి మిగిలినవి? - జడవిగ్రహము మరియు ప్రాణప్రతిష్ఠతంతువు మాత్రమే. అప్పుడు ప్రాణప్రతిష్ఠ జరిగిన విగ్రహము, ప్రాణప్రతిష్ఠ జరగని విగ్రహము, ఈ రెండు విగ్రహములు సమానమైనపుడు, ప్రాణప్రతిష్ఠ జరగని శ్రీసాయి విగ్రహముల కన్ననూ ప్రాణప్రతిష్ఠ జరిగిన దేవాలయ విగ్రహములు ఎట్లు విశిష్టము లగును?

## జీవోద్ధరణము కొరకు దైవము సృష్టిలోనికి ప్రవేశించును :

'అత్రిముని అనసూయలకు ముగ్గురు పుత్రులు పుట్టిరి. మొదటివాడు చంద్రుడు. మూడవవాడు దుర్వాసముని. మధ్యవాడు దత్తాత్రేయముని. శ్రీసాయి దత్తావతారమన్ననూ, దైవత్వము ఎచ్చటనూలేదు' అని శ్రీ సంపూర్ణానంద పలుకుట, వారు ఇంకను బాల్యావస్థలోనే ఉన్నారని నిరూపించుచున్నది. భాగవతకథాను సారముగా - అత్రిముని ఏకైక పరమాత్మ అగు పరబ్రహ్మ దర్శనము కోరి, ఋక్ష పర్వతమున, అనసూయతో కలిసి తపమును చేసెను. సృష్టి స్థితి లయములు ఒకే ఒక పరమాత్మ చేయుచున్నాడని వేదము పలుకుచుండ, సృష్టికర్తయగు బ్రహ్మ, స్థితి కర్తయగు విష్ణువు, లయకర్తయగు శివుడు, వేరువేరుగా వేరువేరు లోకములందుండుట స్పష్టముగాకనిపించుట ఎట్లు కుదురును? ఇదియే అత్రి సందేహము. త్రిమూర్తులు ముగ్గురును సాక్షాత్కరించి 'మేము ముగ్గురు ఒక్కటే. సృష్టి స్థితి లయములను చేయుచున్నాము' అనిరి. అత్రి దీనికి అంగీకరించలేదు. 'త్రిమూర్తులు వేరువేరుగా కనిపించుచుండగా, ఒకే స్వరూపము ఎట్లు అగుదురు?' అని ప్రశ్నించెను. అత్రి శబ్దమునకు అర్థము కూడా 'ముగ్గురు కాదు' అనియే. కావున అత్రి సార్థకనాముడయ్యెను.

అప్పుడు త్రిమూర్తులు కలిసి ఏక స్వరూపములో దర్శనమిచ్చిరి. ఆ ఏక స్వరూపములో బ్రహ్మ – విష్ణు – శివ ముఖములున్నవి. అయినను, వ్యక్తి ఒక్కరే. ఈ స్వరూపము, వేదము బ్రహ్మమును గురించి యిచ్చిన నిర్వచనమునకు సరిగా సరిపోయెను (**యతోవాఇమాని..., ఏకమేవాద్వితీయం...**). ఇదియే త్రిమూర్తులకు మూలమైన ఏక పరబ్రహ్మ స్వరూపము. అనూహ్యమైన పరబ్రహ్మము ఈ ఏకస్వరూపములో నున్నది, విడివిడిగా త్రిమూర్తుల స్వరూపములలోను ఉన్నది (**అవిభక్తం విభక్తేషు...**గీత). అనూహ్య పరబ్రహ్మమునకున్న అనూహ్య శక్తి మహిమ ద్వారా ఇది సాధ్యము. లౌకికసృష్టికి అతీతమైన పరబ్రహ్మశక్తియందు, లౌకికసృష్టి భాగము లందే ప్రవర్తించు తర్కము పనిచేయదు.

ఈ ఏకైక పరమాత్మ స్వరూపము, అనసూయ గర్భమున త్రిమూర్తులుగా మారి, చంద్ర – దత్త – దుర్వాసుల రూపములలో ముగ్గురు పుత్రులుగా గోచరించినది. బ్రహ్మాంశ – విష్ణు అంశ – శివాంశలు ముగ్గురి యందు వేరువేరుగా నుండుటచే ఒకటియే మూడగుట ఇది. ప్రథముడు, తృతీయుడు, తమ బ్రహ్మ – శివ అంశలను దత్తునకు యిచ్చి వెడలిపోయిరి. అనగా త్రిమూర్తుల ఏకస్వరూపమై దత్తాత్రేయరూపము ఏకముఖముతో నిలచినది. ఏకముఖమైనను, మిగిలిన రెండు ముఖముల శక్తులును అందే ఇమిడియున్నవి. దీనిని స్పష్టపరచుటకు, ఏకస్వరూపము త్రిముఖములతో గోచరించినది. వేదపండితుడగు అత్రి సంశయము దీనితో పటాపంచలైనది. ఇంత మహత్తర అంతరార్థము కల ఈ కథను కేవలము ఒక ముని వంశచరిత్రగా మీరు చూచుట, మీ కన్నులకే కాక, మీ బుద్ధికిని పట్టిన చత్వార దోషమును స్పష్టము చేయుచున్నది. ఇట్టి మీరు ఆదిశంకరులను గురించి కూడా 'అతడొక కేరళదేశీయుడైన నంబూద్రి బ్రాహ్మణయువకుడు. వేదశాస్త్రములను బాగుగ అధ్యయనము చేసిన పండితుడు, సంపూర్ణ జీవితానుభవజ్ఞానము లేనివాడు' అనియు చెప్పగల మహానుభావులు! ఆయన యొక్క భాష్యములను, ఆయన యొక్క జీవిత పరమార్థమును అంతరదృష్టితో నిశితముగా పరిశీలించిన కాని, ఆయన సాక్షాత్తు శంకరుల అవతారమని అర్థము చేసుకొనలేరు.

## ఉపసంహారము

ఊహలకు సైతము అందని (**నైషాతర్కేణ..., మాంతువేదన...**) పరబ్రహ్మము, నర శరీరియగు ఒకానొక భక్తజీవుని ఆవేశించి, నరావతారముగ యీ లోకమున ప్రకటిత మగుచుండును. ధర్మమునకు సంభవించిన క్షోభను నివారించి శాంతిస్థాపనము చేయుటకును, మోక్షా సక్తులకు ముక్తి మార్గమునుపదేశించుటకును, భక్తులకు దర్శన, స్పర్శ, సంభాషణ, సహవాసములను చతుర్విధములగు అనుగ్రహములను ప్రసాదించుటకును, ధర్మమోక్షములందు జీవులను నడిపించుటకు కావలసిన జ్ఞానమును ప్రచారము చేయుటకును, నరావతార ప్రయోజనములుండును. ఇస్లాం–హిందూ మతముల విరోధము యొక్క కాలక్రమ ఫలితములే యీనాటి మారణకాండలు. ఈ విరోధమును పరిహరించి ఆనాడే ముందుగా, మతసమైక్యతను సమగ్రముగా స్థాపించుటయే దీనికి శాశ్వత పరిష్కారము. దీనికొరకే శ్రీ షిరడీసాయి, శ్రీ సత్యసాయి అవతారములు ప్రకటితమైనవి. దీనిని అనుసరించియే కార్యక్రమము యొక్క స్వరూపము సంధానమగును. మతధర్మముల విరోధము లోకక్షోభకు దారితీయగా, మోక్షమార్గసాధన సైతము అల్లకల్లోలమగును. అట్టి ప్రత్యేక కార్యక్రమము యొక్క ప్రత్యేకమైన విధానము నర్థము చేసుకొనలేక, అవతారపురుషుని కీర్తిని సహించలేక, సాటి నరరూపముననున్న నరావతరాము పైనున్న అసూయతో, స్వార్థపూరితమైన దురహంకారముతో, అవతార పురుషులను ఆక్షేపించుట (**అవజానంతిమాం...**) కృష్ణావతారము నుండియే గోచరించుచున్నది. నరావతారముగా నరులకు దత్తమైన ప్రతి అవతార పురుషుడును దత్తుడే. ఊహాతీతమైన పరమాత్మ, నరులకు నరరూపమున, చక్షువులకే గోచరించుట దత్తతత్త్వము, బుద్ధితర్కములకును అందని దైవమ, కన్నులకే అందుట, దత్త శబ్ద సారాంశము.

ప్రతి మానవ జీవునకును, తోటిమానవునిపై అసూయ కలుగుటకు కారణము– ఇరువురికిని ఒకే పార్థివమైన శరీర ముండుటయే. ఇదే మానవుడు, తేజోరూప శరీరధారులగు దేవతలపై శ్రద్ధను చూపును. సాటి మానవశరీరమున నున్న భగవంతుని సైతము తిరస్కరించి, తేజోరూపులగు దైవసేవకులగు ఇంద్రాది దేవతల నారాధించును. యాదవులు మానవ శరీరమున నున్న పరమాత్మయగు కృష్ణుని గుర్తించలేక, దైవసేవకుడైన తేజోరూపియగు ఇంద్రుని ఆరాధించుట ఇదే. కాటన్ చొక్కావాడు, సిల్కు చొక్కావాడగు

ఫ్యాన్‌ను అయినా గౌరవించునుకాని, కాటన్ చొక్కాలో నున్న కలెక్టరును సైతము గౌరవించడు. ఇదే మానవులు మానవ శరీరములను త్యజించి, మరణానంతరము తేజోరూపములను ధరించిననూ శివాది తేజోరూపములందున్న భగవంతునిపై నిర్లక్ష్యము చూపుదురు. ఇట్లు మానవుడు, ఇచ్చటను, అచ్చటను దైవమును గ్రహించక ఉభయ భ్రష్టులగుచున్నారు **(మహతీవినష్టిః).** దీనికి కారణము, తమ శరీరము వంటి శరీరము పరమాత్మకున్నప్పుడు నిర్లక్ష్యము వలన కలుగు ద్వేషమే (**ప్రత్యక్షద్విషః**). ఇట్టి అసూయ–అహంకారులగు మానవులు, నరరూపమున సాక్షాత్తుగ లభించిన దైవమును సేవించక, దైవమునకు ప్రతీకలగు విగ్రహములనే సేవింతురు. ఇట్టి సామాన్య మానవుని స్థితియే శ్రీ సంపూర్ణానంద స్వామీజీకిని ఉండుటయే, యీ విమర్శకు కారణము. ఇట్టి అయోగ్యులగు మానవులు దరిచేరకుండా చేయుటకే, రజస్సు–తమస్సు గుణములను ప్రకటించి, దైవము తన కార్యమును చేసుకొనును. కృష్ణుని జారచోరత్వము, సాయి ధూమపానము, యీ కోవకు చెందినవే. గుర్తించు సాధకులకు సైతము ఇవి వారి విశ్వాస బలపరీక్షలగును. ఈ రజస్సు–తమస్సు గుణములు, ఆ గుణములు కల మానవులతో కలిసిపోవుటకును ఉపకరించును. కొంతకాలము కలిసిపోయి, వారిని క్రమముగా దైవము బోధలతో ఉద్ధరించును. అన్ని కోణములలో అవతారతత్త్వమును అర్థము చేసుకొనలేని మూఢులు, ప్రత్యక్షమైన దైవమును త్రోసిపుచ్చి, శాశ్వతముగ నష్టపోవుచున్నారు.

"భల్లూకపట్టు" అను సామెత ప్రకారం–రామభక్తుడైన జాంబవంతుడను భల్లూకము, ఒకే విష్ణువు యొక్క అవతారములగు రామ– కృష్ణుల యొక్క బాహ్య భేదమును తెలుసుకొనలేక, కృష్ణునితో మొండిగా ఎన్నో దినములు యుద్ధము చేసెను. అట్లే శ్రీ సంపూర్ణానంద, ఒకే శివుని అవతారములగు షిరిడీసాయి (**షిరిడీసాయి– శివ, సత్యసాయి – శివ శక్తి, ప్రేమసాయి – శక్తి అవతారములు**) మరియు శంకరుల బాహ్యభేదము వలన భ్రమతో, షిరిడీసాయిని విమర్శించుచున్నారు. శైవ వైష్ణవ మత సమన్వయకర్త శంకరులు, హిందూ– ఇస్లాం మత సమన్వయకర్త షిరిడీ సాయి, ఆయాకాలానుగుణముగ వేషభాషలలో భేదము కలిగి ఉండవచ్చును. విష్ణు–శివ – అల్లాలతో ఒకే ఊహాతీత పరబ్రహ్మము ఉన్నందున,లోనున్న తత్త్వమొకటేయని గుర్తించవలెను.

దైవము ఊహాతీతమని మూడు ప్రమాణ గ్రంథములు (**ప్రస్థానత్రయము**) నిర్ణయించినవి. వేదము (**యతోవాచో, నమేధయా...**), గీత (మాంతువేదన...) మరియు బ్రహ్మసూత్రములు (**జన్మాద్యస్య...**) పరమాత్మ యొక్క స్వరూపమును చెప్పలేమని చెప్పినవి. దీనికి కారణమేమనగా – ఖాళీస్థలమైన ఆకాశమును సృష్టించిన పరమాత్మలో ఆకాశము ఉండుటకు వీలులేదు. ఎందుకనగా సృష్టించబడిన ఆకాశము, తన సృష్టికి ముందే, తనకు కారణమైన దైవములో ఉండజాలదు. ఆకాశము తనలో లేనందున, దైవమునకు, ఆకాశ లక్షణమైన పరిమాణములేదు. కావున పరిమాణములేని ఏ వస్తువైనా ఊహించుటకు వీలుకానిదే. ఇట్టి ఊహాతీతమైన పరమాత్మ, ఊహలకును, కన్నులకు సైతము కనపడు నరరూపమును ఆవేశించి, దానితో తాదాత్మ్యమును పొంది, జ్ఞానప్రచారము చేయుటకు, అవతార పురుషునిగా వచ్చుచున్నాడు. పండితులకు శంకర రూపంతో, పామరులకు సాయిరూపంతో అవతరించినాడు. శివుడు జ్ఞానప్రదాత (**జ్ఞానం మహేశ్వరాత్....**). శివుడు తేజోరూపము, సాయి శంకరులు మానవరూపములు. శివ, విష్ణు, బ్రహ్మాది రూపములు తేజో రూపములు. ఈ తేజో మానవ రూపములన్నింటిలోను ఉన్నది ఒకేఒక ఊహాతీత పరమాత్మయని తెలుసుకొన్నచో, మతముల మధ్య పరస్పర విరోధము అంతరించును. అప్పుడే విశ్వశాంతి ప్రతిష్ఠించబడును. ఈ బ్రహ్మజ్ఞానము లేకపోవుటచేత, అవతార ఉపాధి రూపములనే పరమాత్మయని భ్రమించి, అన్ని అవతార ఉపాధులలోనున్న ఊహాతీత పరబ్రహ్మమును గుర్తించక, ఊహలకందు ఉపాధిరూపముల బేధమును అధిగమించలేక మత కలహములతో అశాంతిని నెలకొల్పుచున్నారు. ఊహలకందు వస్తువులెన్నియైన విడివిడిగా ఉండవచ్చును కాని, ఊహాతీతములగు ఎన్ని వస్తువులైనను ఒకటే కావలయును. దైవము ఊహాతీతము కావుననే ఒకే దైవముగా ఏకత్వము సిద్ధించినది.



# శ్రీదత్తాష్టకమ్ - 1

**1) వాణీ మానస బుద్ధితర్క సమభిస్పృష్టాయ నైవక్వచిత్**
**నోహ్యాయ ప్రతిపాదితాయ నిగమై రేవం తథా గీతయా ।**
**మాం జానాతి నకశ్చనేత్యవిదితం స్వం వేత్తి య: కేవలం**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే ॥**

వాక్కులు, మనస్సు, బుద్ధి, తర్కములచేత ఎచ్చటను చిక్కనివాడును, అనూహ్యుడు అని వేదములచేత ప్రతిపాదించబడిన వాడును, గీత చేతను 'నన్ను ఎవడును తెలియజాలడు' అని చెప్ప బడినవాడును, తనను తాను మాత్రమే తెలుసుకొనగల వాడును (బ్రహ్మవిత్ బ్రహ్మైవ), అగు గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**2) ఆమ్నాయా అపి నేతినేతి వచసా సర్వేఽపి సర్గాంశకా:**
**నబ్రహ్మేతి నిషేధమార్గ కలయా యం బోధయన్త్యద్భుతమ్ ।**
**ప్రామాణ్యచ్యుత మప్రమేయ ముపధిద్వారైవ దృగ్గోచరం**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే ॥**

వేదములు సైతము 'ఇది కాదు ఇది కాదు' అని అన్ని సృష్టి భాగములను బ్రహ్మము కాదని నిరాకరించిన పద్ధతి ద్వారా ఏ అద్భుత పురుషుని బోధించుచున్నవో, ఏ ప్రమాణమునకును అందకపోవుట వలన అప్రమేయుడని చెప్పబడుచున్ననూ, తాను ఆశ్రయించిన ఉపాధి ద్వారా కన్నులకే గోచరించుచున్న గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**3) ఆకాశస్య చ కారణం కృతిజనే: పూర్వం న తస్మిన్నయం**
**యస్మాన్నో పరిమాణ మాత్మని తతో నోహ్యం ధియామేవ య: ।**
**జ్ఞానం దాతు ముపాధి మానుషతను ర్మూలం చిదిత్యుచ్యతే**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే ॥**

'ఖాళీస్థల రూపమైన ఆకాశమునకు బ్రహ్మము కారణము' అని శ్రుతి. కారణమైన బ్రహ్మమునందుదాని కార్యమైన ఆకాశము, తాను పుట్టుటకు ముందు ఉండజాలదు.

ఏలనన ఏదియును దాని పుట్టుక ముందు అది ఉండలేదు. కావున బ్రహ్మమునందు ఆకాశము ఉండుటకు వీలులేదు. కావున ఆకాశగుణమైన పరిమాణము బ్రహ్మమునందు లేదు. పరిమాణములేని వస్తువును ఎవరును ఊహింపజాలరు. కావున ఏ బుద్ధులకైనను బ్రహ్మము అనూహ్యము. అట్టి అనూహ్య బ్రహ్మము జనులకు జ్ఞానమును బోధించుటకై నరాకారమును ధరించుచున్నది. జ్ఞానమునకు మూలపదార్థము చైతన్యము కావున బ్రహ్మము చైతన్యమును ఆశ్రయించుచున్నది అని చెప్పవచ్చును. ధరించువానిని ధరించబడు పదార్థము ద్వారా సంబోధించవచ్చును. పండ్ల బుట్టను ధరించిన వానిని 'పండ్లబుట్టా' అని పిలువవచ్చును. కావున చైతన్యమును ధరించిన బ్రహ్మమును చైతన్యము అని పిలువవచ్చును. ఇంత మాత్రముచేత బ్రహ్మము చైతన్యము కాదు. అట్టి బ్రహ్మము అగు గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**4) చైతన్యాశ్రయ శేముషీపర మహాప్రజ్ఞాన శబ్దశ్రుతో**
**యో వై మానవశేఖరో గురువరో జ్ఞానం న చిత్కేవలా ।**
**దత్తో మానవసఙ్ఖ్యయాయ జగతే త్రైగుణ్యచిత్తేతరో**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే ॥**

జ్ఞానము బుద్ధిని, బుద్ధి చైతన్యమును ఆశ్రయించి ఉన్నది. ఈ జ్ఞానము అద్భుతమైనప్పుడు ప్రజ్ఞానము అని చెప్పబడును. అట్టి ప్రజ్ఞానమే బ్రహ్మమని శ్రుతిలో చెప్పబడుచున్నది. కావున బ్రహ్మము నరాకారమైన ఉపాధిని ఆశ్రయించి అవతరించినప్పుడు అద్భుతమైన జ్ఞానమును బోధచేయు నరోత్తముడగు గురువరుని రూపములో బ్రహ్మము సాక్షాత్కరించుచున్నది. జ్ఞానము గానీ, ప్రజ్ఞానముగానీ, కేవలము చైతన్య మాత్రముగా చెప్పుట యుక్తము కాదు. మానవులు నివసించు ఈ లోకమునకు జ్ఞాన బోధకై అవతరించు బ్రహ్మము, జ్ఞాన స్వరూప పదార్థమును ఆశ్రయించినప్పుడు, చైతన్య రూపములగు త్రిగుణములకును భిన్నముగానుండుచున్నది. కావున చైతన్య భిన్నమగు బ్రహ్మము త్రిగుణములకు, అంత:కరణములకు, జ్ఞానమునకును, ప్రజ్ఞానమునకు కూడా భిన్నమై అనూహ్యముగా నుండుచున్నది. అట్టి గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**5) తేజోదేహవతా మముత్ర సయుజే తేజశ్శరీరాయ చ**
**షట్పాణిత్రిముఖాయ మానవకృతే బాహుద్వయాస్యాయ తే।**
**నోహ్యాయ ప్రకృతిస్వరూపలతికాదత్తాత్మవిద్యుద్విదే**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే॥**

పై లోకములందున్న తేజోరూప శరీరధారులగు దివ్యజీవులగు దేవతలతో కలిసిపోవుటకు తేజోరూపమును శరీరముగా గ్రహించి, ఆరు చేతులతో, మూడు ముఖములతో అవతరించినవాడును, మానవ లోకములో నరులతో కలిసి పోవుటకు రెండు చేతులు ఒక ముఖముతో అవతరించువాడును, స్వయముగా ఎట్టి ఊహలకు సైతము అందని వాడును, ప్రకృతి స్వరూపమగుమానవరూపమును లోహపు తీగను విద్యుత్ వలె ఆవేశించినట్టి గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**6) బ్రహ్మజ్ఞానవిదాం సమన్వయకృతే నోహ్యాత్మన:కేవలాత్**
**నానాసృష్టిపదార్థతర్క్యధిషణా నైకాత్మ వాదచ్ఛిదే।**
**నానావిన్మత భేదనాశ జగతీ శాన్తిప్రదానాయ తే**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే॥**

అనూహ్యము ఒక్కటియే ఉండవలెను కావున బ్రహ్మము అనూహ్యము అన్నప్పుడు అన్ని మతములు ఒకే పరమాత్మను అంగీకరించవలసిన అవసరము ఏర్పడును కావున అన్నిమతములు విరోధమును వదలి సమన్వయమును పొందవలసియే యున్నది. ఇట్లుగాక ఊహలకు గోచరించు సృష్టిభాగములగు వివిధ పదార్థములను వేరువేరుగా బ్రహ్మము అని భావించినప్పుడు ఒక్కొక్కమతమునకు ఒక్కొక్క బ్రహ్మము సిద్ధించునుగావున అట్టి వాదములను ఖండించువాడును, నానామతముల భేదములను నాశముచేసి జగత్తునకు శాంతి ప్రదానము చేయువాడగు నీకు గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**7) ఆచార్యత్రయగోచరాయ సుధియాం మూర్తిత్రయాలమ్బినే**
**జ్ఞానానన్తరభక్తికర్మజననాత్ పశ్చాత్ ఫలాత్ కర్మణ:।**
**సిద్ధాన్తప్రతిపాదకాయ జగతే భాష్యత్రయావిర్భవాత్**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమోబ్రహ్మణే॥**

తన మూడు రూపములైన త్రిమూర్తులగు బ్రహ్మ విష్ణు మహేశ్వరులే, మధ్వ రామానుజ శంకరగురువులుగా గోచరించి వరుసగా కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగమును బోధించి కర్మయోగమునకు మాత్రమే ఫలము లభించుటను, జ్ఞానముద్వారా భక్తి, భక్తి ద్వారా కర్మకలుగుటను నిరూపించి, ఈ మూడు యోగములను మూడు భాష్యముల నిర్మాణముచే సిద్ధాంతములను ప్రతిపాదించినట్టి గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**8) బోధ్యాబోధ్య సమన్వయాయ సహసా బాహ్యప్రకృత్యాత్మనా**
**తాదాత్మ్యేన నసర్వజీవవిషయాత్ సేవ్యాయ నస్సర్వదా ।**
**కైవల్యందదతే నకామ్య విదుషే మర్త్యావతారాత్మనే**
**దత్తాత్రేయయతీశ్వరాయ గురవే తస్మై నమో బ్రహ్మణే ॥**

ఊహించుటకు వీలగునట్టి బాహ్యప్రకృతి రూపమగు నరశరీరము మరియు ఊహించుటకు వీలుగానట్టి లోపల అంత:స్వరూపములతో ఊహ్య-అనూహ్య తత్త్వముల సమన్వయము చేయుచు, ఒకానొక నరశరీరమును మాత్రమే అవేశించుట వలన సర్వనరులును బ్రహ్మముకారు కావున సర్వజీవులచే సేవించబడువాడును, నరావతారముగా అవతరించుటలో కోరికలేని యోగ్యునకు మాత్రమే నరావతార లాభమగు కైవల్యమును ప్రసాదించువాడును, గురుబ్రహ్మయైన దత్తాత్రేయ యతీశ్వరునకు నమస్కారము.

**9) ఔదుమ్బరతరో ర్మూలే, కాషాయాంశుకధారిణే ।**
**నరావతారచిన్ముద్రా-మౌనానూహ్యవదం భజే ॥**

మేడిచెట్టు మూల దేశమునందు ఆసీనుడై, కాషాయవస్త్రమును ధరించి, బ్రహ్మమును సూచించు బొటనవేలుతో చేర్చబడిన జీవుని సూచించు చూపుడువేలుతో చిన్ముద్రను ధరించి, తనమౌనముతో బ్రహ్మము అనూహ్యము అని బోధించు దత్తాత్రేయస్వామిని భజించుచున్నాను.

**10) కరజపసరకుణ్డీశఙ్ఖచక్ర త్రిశూల-**
**డమరుక పరిపూర్ణం త్ర్యాననై స్సుప్రసన్నమ్, ।**
**శ్రుతిశునకసమేతం ధర్మధేన్వా చ పృష్ఠే,**
**మునికులపతిదత్తాత్రేయదేవం స్మరామి ॥**

చేతులలో జపమాల, కమండలము, శంఖము, చక్రము, త్రిశూలము, డమరుకము కలవాడును, మూడు ముఖములతో ప్రసన్నముగా కనిపించువాడును, వేదములే శునకములుగా తనచుట్టు కలవాడును, వెనుక వైపు ధర్మమే ధేనువుగా కలవాడును, మునులకు కులపతియగు దత్తాత్రేయదేవుని స్మరించుచున్నాను.

**శ్రీదత్తస్వామి** విరచితమ్...

# శ్రీదత్తాష్టకమ్ - 2

**1) కాషాయవాస: పరివేష్టితాయ, మహాకపర్దత్రయశోభితాయ ।**
**బ్రహ్మాచ్యుతేశానవపుర్ధరాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

కాషాయ వస్త్రముచే చుట్టబడినవాడును, మూడు గొప్ప జటాజూటములతో శోభిల్లువాడును, బ్రహ్మ, విష్ణు, శివ రూపములను ధరించినవాడును అగు దత్త యతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**2) మహాశ్వరూపై ర్నిగమై ర్వృతాయ, ధర్మేణ ధేన్వాకృతినా శ్రితాయ ।**
**నరావతారాయ గురూత్తమాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

పెద్ద కుక్కల రూపములను ధరించిన నాలుగు వేదములచే చుట్టబడినవాడును, ధేనురూపమును ధరించిన ధర్మదేవతచే ఆశ్రయింపబడినవాడును, నరావతారమును ధరించిన గురూత్తముడగు దత్త యతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**3) జ్ఞానప్రబోధార్థముపాగతాయ, నిత్యోపదేశై ర్భువి సఞ్చరాయ ।**
**అత్యద్భుతశ్రీమహిమాకరాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

జ్ఞానమును బోధించుటకై అవతరించువాడును, నిత్యము భూమిలో జ్ఞానోపదేశములను చేయుచు సంచరించువాడును, అత్యద్భుతముగా ప్రకాశించు మహిమలను చేయువాడును అగు దత్త యతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**4) శ్రీపాదనామాదిమగోచరాయ, నృసింహభారత్యభిధాన్తరాయ ।**
**మాణిక్యపూర్వప్రభుసంభవాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

మొదట శ్రీపాదవల్లభునిగా, తరువాత నృసింహభారతిగా, తరువాత మాణిక్యప్రభువుగా, అవతరించిన దత్త యతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**5) సమర్థనామ్నా పరమీక్షితాయ, సాయీతి పశ్చాత్ ప్రథితాభిధాయ ।**
**గజాననాద్యన్య గురూద్భవాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

సమర్థ నామముతో తరువాత కనపడినవాడును, సాయి అను పేరుతో తరువాత ప్రసిద్ధుడైనవాడును, గజాననుడు మొదలగు అన్యగురువులుగా జన్మించిన వాడును అగు  దత్త యతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**6) ఆమ్నాయతత్త్వ ప్రతిపాదకాయ, నవీనవిజ్ఞానసమన్వయాయ ।**
**భాష్యత్రయైకార్థనిరూపకాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

వేదముల సారమును ప్రతిపాదించువాడును, నవీన విజ్ఞానముతో సమన్వయము చేయువాడును, మూడు భాష్యములకును ఒకే అర్థమును నిరూపించు వాడును అగు దత్తయతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**7) శ్రుతిస్మృతిజ్ఞానమహార్ణవాయ, సత్తర్కమార్గార్థసమర్థకాయ ।**
**తాత్పర్యసిద్ధానుభవప్రదాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

శ్రుతి స్మృతులయొక్క జ్ఞానమునకు మహాసముద్రము వంటివాడును, బాగుగా తర్కించుట అనుమార్గమును సమర్థించువాడును, చిట్టచివర కనుగొన్న సత్యము అను తాత్పర్యమును అనుభవమునందు చూపించువాడును అగు దత్తయతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**8) ప్రభాతకాశీవిధినైష్ఠికాయ, మధ్యాహ్నకొల్హాపురభిక్షుకాయ ।**
**సాయాహ్నసహ్యాచలవిశ్రమాయ, నమో నమో దత్తయతీశ్వరాయ ॥**

ఉదయకాలమున కాశిలో స్నానసంధ్యాదులను నెరవేర్చువాడును, మధ్యాహ్నమున కొల్హాపురమునందు భిక్షాటనము చేయువాడును, సాయంత్రమున సహ్యాపర్వతమున విశ్రమించువాడును అగు దత్తయతీశ్వరునకు నమస్కారము నమస్కారము.

**9) అజహరిహరమూర్తిత్రైతవేషై ర్నటన్తం,**
**జగదుదయసురక్షాశిక్షయా సద్వినోదమ్ ।**
**కథమపి నఖలూహ్యం తైజసై: పార్థివైర్వా,**
**స్ఫురదుపధిభిరీక్ష్యం దత్తమారాధయామి ॥**

బ్రహ్మ, విష్ణు, శివులను మూడు వేషములలో నటించు ఏకైక నటుడును, జగత్తుయొక్క సృష్టిరక్షణ లయములతో వినోదించువాడును, ఏ విధముగను ఊహించుటకు వీలుగాని నిజస్వరూపముగలవాడును, మనకు కనపడుచున్న తేజోరూపములను గానీ మానవ రూపములను గానీ ఉపాధులుగా స్వీకరించి అవతరించుచున్నవాడును అగు దత్తుని ఆరాధించుచున్నాను.

**శ్రీదత్తస్వామి** విరచితమ్...

# శ్రీదత్తాష్టకమ్ - 3

1) **వేదాన్తవిద్యా మమృతం హి దాతుం, జగద్విశన్తం విబుధవ్రజాయ ।**
**తం జ్ఞానమోహిన్యవతార మేకం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

వివేకవంతులకు వేదాన్త శాస్త్రమను అమృతమును ప్రసాదించుటకై జగత్తులోనికి ప్రవేశించినవాడును, ఒకే ఒకడైన జ్ఞాన మోహిని రూపముతో అవతరించిన వాడును అగు సద్గురువులకుసార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

2) **జీవంసముద్ధర్తు మపత్యరూపం, తత్రాత్ర తేజ:పృథివీతనుభ్యామ్ ।**
**ధియాఽపినోహ్యం దయయాఽవతీర్ణం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

తన సంతానరూపులైన జీవులను ఉద్ధరించుటకు పైలోకమున తేజో రూపములను, క్రింది భూలోకమున మానవ రూపములను ధరించి, బుద్ధులకు సైతము అందని వాడైనను దయాస్వభావముచేత ఉపాధులనాశ్రయించి అవతరించు వాడగు సద్గురువులకు సార్వభౌముడైన దత్తునిభజించుచున్నాను.

3) **తం పణ్డితంమన్యసహస్రబోధై:, పథ:పరిభ్రష్టనరాన్విలోక్య ।**
**మార్గప్రబోధాయ సదా సమేతం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

తామే పండితులమని భావించి నట్టి అనేక గురువుల బోధలవలన సత్యమైన మార్గము నుండి భ్రష్టులైన నరులను చూచి, కరుణతో సత్యమైన మార్గమును బోధించుటకై, సదా భూలోకమున అవతరించుచున్న సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

4) **ఆధ్యాత్మవిద్యా పురుషార్థవిద్యా - పయ:పయో భేదవిదం సుహంసమ్ ।**
**సాక్షాత్తమేకం పరమం హి హంసం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

పాలను నీటినుండి వేరుచేయగల నైపుణ్యమును కల్గినట్టి హంసవలె బ్రహ్మపరమైన ఆధ్యాత్మ విద్యను జీవపరమైన లౌకిక విద్య నుండి వేరు జేయగల ఒకేఒకడగు సాక్షాత్తు పరమహంసయగు సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**5) తం శఙ్కరాచార్యమపిస్ఖలన్తం, పృచ్ఛన్త మన్తర్నిహితాత్మతత్త్వే ।**
**చణ్డాలరూపేణ సమేత్య కాశ్యాం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

కాశీ నగరమందు చండాలరూపముతో వచ్చి, అన్తఃస్వరూపమైన ఆత్మతత్త్వము నందు పొరపాటు పడిన శంకరాచార్యుని సైతము ప్రశ్నించినట్టి సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**6) ధనేషణామూలలతా లవిత్ర-శ్రీయన్త్రవిద్యా పరమార్థవిజ్ఞమ్ ।**
**కుర్వన్తమాప్తం భృగురామశిష్యం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

ధనేషణ అను మూల లతను ఛేదించు కొడవలియగు శ్రీయంత్ర విద్యా సారమునందు పండితునిగా ఆప్త శిష్యుడగు పరశురాముని చేసినట్టి సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**7) సూతే జగద్య స్సవితా స దేవో, గాయన్తమారక్షతి గీతిరేషా ।**
**గాయత్ర్యపార్థం ప్రహరన్త మిత్థం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

గాయత్రి అనగా గానము చేయువానిని పరమాత్మ రక్షించును అని అర్థము. అట్టి పరమాత్మయే జగత్తును ప్రసవించినట్టి బ్రహ్మదేవుని స్వరూపమున ఉన్న సవిత. గాయత్రి అనగా ఆ పేరుతో ఉన్న ఒకానొక ఛందస్సుతో నిర్మించబడిన మంత్రము కాదు-అని ఈ విధముగా గాయత్రి శబ్దార్థమునుబోధించి దాని అపార్థమును నిరాకరించినట్టి సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**8) వైశ్వానరాగ్నౌ జఠరే ఘృతాన్నం, ప్రదాయ యజ్ఞే హవనం హి సత్యమ్ ।**
**న లౌకికాగ్నావితి బోధయన్తం, దత్తం భజే సద్గురుసార్వభౌమమ్ ॥**

వైశ్వానర నామముగల దేవతాగ్ని రూపమగు ఆకలియగు జఠరాగ్నియందు నేతితో కూడిన అన్నమును సమర్పించి ఆకలిని శాంతింపచేయుటయే నిజమైన యజ్ఞము, సత్యమైన హోమము. అంతే కాని కట్టెలతోమండుచున్న లౌకికాగ్నియందు నేతినిబోసి దగ్ధము చేయుటకాదు-అని బోధించినట్టి సద్గురువులకుసార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**9) త్రిముఖనయనషట్కాలోకషట్పాదబృన్దైః,**
**మధు మునిజనచేతోభక్తిమాస్వాదయన్తమ్ ।**
**భజ గురు మనసూయాగర్భశుక్త్యాత్తముక్తా-**
**ఫలమపఫలసేవాజ్ఞానహారస్థదత్తమ్ ॥**

మూడు ముఖములలోనున్న ఆరు నేత్రములు అను ఆరు చరణములుగల తుమ్మెదల చూపులతో మహర్షుల మనస్సులలోనున్న భక్తి మకరందమును ఆస్వాదించుచున్న వాడును, అనసూయ గర్భమను ముత్యపు చిప్పలో పుట్టిన ముత్యము వంటి వాడును, ఫలమును కోరక సేవను చేయుట అను జ్ఞానమార్గము అను హారము మధ్యలోనున్న ముత్యమైనట్టి సద్గురువులకు సార్వభౌముడైన దత్తుని భజించుచున్నాను.

**శ్రీదత్తస్వామి విరచితమ్...**

# శ్రీదత్తాష్టకమ్ - 4

**1) ఆధారం సర్వసిద్ధీనాం, ఆహారం భక్తజీవినామ్ ।**
**ఆసారం కరుణాబ్దానాం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

సర్వసిద్ధులకు ఆధారుడు, భక్తజీవులకు ఆస్వాదనీయమైన ఆహారము వంటివాడును, కరుణ మేఘములు కురియు కుంభవృష్టి వంటివాడును అగు దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**2) బ్రహ్మజ్ఞాన మహాపారా - వార వారిజ ముత్థితమ్ ।**
**సమన్వయ సుగన్ధేన, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

త్రిమతముల సమన్వయము అను సుగంధమును వెదజల్లుచు, బ్రహ్మ జ్ఞానమను మహాసముద్రమునందు పైకి వికసించిన పద్మమువంటి దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**3) వేదాన్తార్ణవ దుర్బుద్ధి - లవణామ్భో విషాత్పరమ్ ।**
**సత్యజ్ఞాన సుధోద్ధారం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

వేదాంతశాస్త్రము అను సముద్రమునుండి, ఉప్పునీటినుండి దుర్బుద్ధులగు గురువుల అజ్ఞానము అను హాలాహల విషము ఉద్భవించిన తరువాత, సత్య జ్ఞానము అను అమృతమును ఉద్ధరించిన దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**4) భక్తజీవైక తాదాత్మ్యా, దవతీర్ణం నరాకృతిమ్ ।**
**నరలోకం సముద్ధర్తుం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

భూలోకములో నరులను ఉద్ధరించుటకు, ఒకానొక భక్తజీవుడగు నరుని అవేశించి, వానితో ఏకత్వమును పొంది, నరావతారముగా అవతరించు దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**5) అజ్ఞానిగురుభి ర్వేదే, దైత్యై రపహృతే సతి ।**
**అక్షిసద్దర్శనం మత్స్యం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

అజ్ఞానులగు గురువులు అను సోమకాసురుల వంటి రాక్షసులు, సత్యజ్ఞానము అను వేదమును అపార్థములతో కప్పి, అది కనపడుకుండునట్లు చౌర్యమును చేయగా, దానిని జ్ఞాననేత్రము అను చేపవంటి కన్ను అను మత్స్యావతారము ద్వారా ఉద్ధరించి, వారిని ఖండించిన దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**6) ఐకమత్యాయ విదుషాం, మతత్రయ వివాదినామ్ ।**
**ఏకార్థ భాష్య వక్తారం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

త్రిమతముల వాదములతో కలహించుచున్న పండితులయొక్క సమన్వయము కొరకు త్రిమత భాష్యములను సమ్మేళనమును చేసి, ఒకేఒక భాష్యమును చెప్పుచున్నట్టి దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**7) నవకోటి స్మరాకారం, వైరాగ్యారుణ వాససమ్ ।**
**కాలాఞ్జన జటాబన్ధం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

నవకోటి మన్మథుల సౌందర్యము కలవాడును, పూర్ణ వైరాగ్యమును సూచించు కాషాయ వస్త్రమును ధరించినట్టివాడును, నల్లని కాటుకవంటి రంగుగల జటాజూట బంధము కలవాడును అగు దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**8) బోధయన్తం చ వేదాన్తే, వృద్ధశిష్య మునీ న్ముహుః ।**
**నిత్యషోడశ వర్షాఙ్గం, దత్తాత్రేయ ముపాస్మహే ॥**

వృద్ధశిష్యులైనట్టి మహర్షులకు మాటిమాటికి వేదాంతశాస్త్రమును బోధించుచున్న, ఎల్లప్పుడును పదునారు సంవత్సరముల వయస్సుగల సుందర శరీరధారియగు దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.

**9) స్మరశత కమనీయం విద్యుదుద్యోత కాయమ్,**
**త్రితిలక రుచి ఫాలం బద్ధకాషాయచేలమ్ ।**
**కర కృత పరముద్రం జ్ఞానబోధై రనిద్రమ్**
**యతితతిపతి దత్తాత్రేయ మారాధయామి ॥**

శతమన్మధులతో సమానమైన రూపము గలవాడును, విద్యుత్తులతో మెరయు శరీరము కలవాడును, మూడు తిలకలములు కలసిన తిలకముతో ప్రకాశించు ఫాలము కలవాడును, కాషాయ వస్త్రమును కట్టుకున్నవాడును, చేతితో చిన్ముద్రను చూపించువాడును, జ్ఞానబోధలతో నిద్రలేనివాడును, సంన్యాసుల సమూహములకు అధిపతియగు దత్తాత్రేయుని ఆరాధించుచున్నాను.

**శ్రీదత్తస్వామి విరచితమ్...**



# శ్రీదత్తాష్టకమ్ - 5

శ్లో॥ బ్రహ్మవిష్ణు శివాఖ్యానాం । మూర్తీనాం మూలహేతవే ।
త్రిమూర్తి ముఖ పద్మాయ । దత్తాత్రేయాయ తే నమః ।॥1॥

శ్లో॥ అరుణ శ్యామధావళ్య - వర్ణమిశ్రమ వర్ణినే ।
అనసూయైక భాగ్యాయ । దత్తాత్రేయాయ తే నమః ॥2॥

శ్లో॥ శంఖం చక్రం త్రిశూలం చ । ఢక్కా మపి కమండలుమ్ ।
బిభ్రతే ఉక్ష స్రజంహస్తైః । దత్తాత్రేయాయ తే నమః॥3॥

శ్లో॥ కుర్వతే భావమాత్రేణ । సృష్టి స్థితి లయానపి
సర్వదేవ స్వరూపాయ । దత్తాత్రేయాయ తే నమః ॥ ॥4॥

శ్లో॥ గురూణాం గురురాజాయ । శ్రుతీనాం శ్రుతయే ఉపిచ ।
శాస్త్రాణా మపి శాస్త్రాయ । దత్తాత్రేయాయ తే నమః ॥॥5॥

శ్లో॥ బాలోన్మత్తవదీక్ష్యాయ । సర్వలీలా విహారిణే ।
అవధూతైక లక్ష్యాయ । దత్తాత్రేయాయ తే నమః ॥ ॥6॥

శ్లో॥ కరుణావాహినీమూల - సర్వలీలా విహారిణే ।
ఆహ్వానాదేవదృష్టాయ । దత్తాత్రేయాయ తే నమః ॥ ॥7॥

శ్లో॥ శ్రితానుద్ధర్తు కామాయ । కలౌ సర్వగతాయ చ
సాధ్యా సాధ్యాని దదతే । దత్తాత్రేయాయ తే నమః ॥ ॥8॥

**ఫలశ్రుతి**

శ్రీ దత్తాత్రేయ దేవస్య, పుణ్యం కృష్ణ కృతాష్టకమ్ ।
పఠతాం స్యా దిహాముత్ర, ఫలమీప్సిత మక్షయమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

# శ్రీదత్తస్వామి విరచిత శ్రీ దత్త నవరత్నాలు

1. నమస్తే త్రిమూర్తి స్వరూపోజ్జ్వలాయ – నమస్తే త్రిధా సర్గ రక్షాలయాయ ।
నమస్తే త్రిశక్త్యుజ్జ్వనా వల్లభాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

2. నమస్తే త్రిలోకాది మధ్యాత్యయాయ – నమస్తే త్రికాలార్థ సన్దర్శనాయ ।
నమస్తే త్రిపుట్యర్థ సద్బోధకాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

3. నమస్తే త్రివేద స్వరోచ్చారణాయ – నమస్తే త్రిపుణ్డ్రోర్ధ్వ రేఖాముఖాయ ।
నమస్తే త్రిణేత్రాన్తరాలోకనాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

4. నమస్తే త్రిధాచార్య రూపాగతాయ – నమస్తే త్రివేదాన్త సంస్థాపకాయ ।
నమస్తే త్రిభాష్య ప్రయాగాన్వయాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

5. నమస్తే త్రిబన్ధేషణా ఖణ్డనాయ – నమస్తే త్రికర్మేధ్మ దాహానలాయ ।
నమస్తే త్రిదేహైక మోక్ష ప్రదాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

6. నమస్తే త్రిపాదార్థ మన్త్రాధిపాయ – నమస్తే త్రిమన్త్రైక మన్త్రాశ్రయాయ ।
నమస్తే త్రివర్ణైక వర్ణేరితాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

7. నమస్తే ధరామణ్డలే సఞ్చరాయ – నమస్తే చతుస్సారమేయావృతాయ ।
నమస్తే సకృద్భిన్న రూపేక్షితాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

8. నమస్తే శివబ్రహ్మ విష్ణ్వాననాయ – నమస్తే షడబ్జాంశు పాణి వ్రజాయ ।
నమస్తేఽనసూయాత్రిపుత్రాయితాయ–పరబ్రహ్మదత్తాయ భూయో నమస్తే॥

9. నమస్తే మహాజ్ఞాన సత్పణ్డితాయ – నమస్తే గురుశ్రేణి రాజోత్తమాయ ।
నమస్తే మహాయోగ పీఠేశ్వరాయ – పరబ్రహ్మ దత్తాయ భూయో నమస్తే ॥

ఫలశ్రుతి

దత్తాయ నవరత్నానాం, శ్లోకమాలాం సమర్పితామ్ ।
కృష్ణేన పఠతాం సిద్ధః, శ్రీ దత్త సదనుగ్రహః ॥



శ్రీ దత్తస్వామి

( జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి )